నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 18 మే 2024 | KAMAREDDY

నెలరోజులైనా వడ్లు కొనరా?

- డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌ను ఘెరావ్ చేసిన రైతులు
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై మండిపాటు

బీబీపేట సొసైటీ ఆవరణలో డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌ను ఘెరావ్ చేస్తున్న రైతులు

బీబీపేట్, మే 17: కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 35రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ఆరోపిస్తూ బీబీపేట మండల కేంద్రంలో రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనా రెడ్డిని ఘెరావ్ చేశారు. దీంతో బీబీపేట సొసైటీ వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని, వర్షం కారణంగా తడిసి ముద్దయి వడ్లు మొలకెత్తి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు లేవని, ధాన్యం ఆరబెట్టిన సమయంలో వర్షాలు కురిస్తే తడవకుండా, రైస్‌మిల్లులో ధాన్యం పట్టని సమయలో ఫంక్షన్ హాళ్లను లీజ్‌కు తీసుకుని ఉంచేవారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోతున్నామని, రైతులు ఆత్మహత్యకు పాల్పడేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కాంట చేసి నిల్వ ఉంచిన బ్యాగులను రైస్‌మిల్లులకు తరలించలేని చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు..

రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గత ప్రభుత్వం అండగా ఉన్నది. ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేసింది. ఇప్పటి ప్రభుత్వం రైతులతో ఆడుకుంటున్నది. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నది. అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల కష్టాన్ని గుర్తించి ధాన్యం తూకం త్వరగా వేయించాలి.

- దుంప భూమేశ్, రైతు, బీబీపేట్

శుక్రవారం కురిసిన వర్షానికి సదాశివనగర్ మండలం అడ్లూర్-ఎల్లారెడ్డిలోని కొనుగోలు కేంద్రంలో వడ్ల చుట్టూ చేరిన నీరు



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సన్నాలకే బోనస్ ఇస్తామనడం సిగ్గుచేటు

- వరికి రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, మే 17: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదన్నారు. ఆగస్టు 15 తర్వాత రుణమాఫీ చేస్తామని రైతులను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతులు పండించిన సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గు చేటని, రైతులు పండించిన సన్నవడ్లతోపాటు దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. తెలంగాణ ప్రజలు, రైతులను ఆదుకునేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం చెబుతున్నాడని, అప్పటిలోగా అన్ని రకాల ఎన్నికలు పూర్తవుతాయన్నారు. అనంతరం ఖజానాలో డబ్బులు లేవని మరోసారి రైతులను మోసం చేసే అవకాశముందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే ఇంకా బాగుంటుందని, గెలిచినా, ఓడినా ప్రజల మధ్యలో ఉండి సేవ చేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారని, ఎవరిపైనైనా తప్పుడు కేసులు బనాయిస్తే తానే పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి ధర్నా నిర్వహించి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్, పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మొచ్చ శ్రీనివాస్, చింతల గంగాదాస్, శ్రీనివాస్, మధుకర్‌రావు, నాయకులు కుంచాల రాజు, నల్ల హన్మంత్‌రెడ్డి, శక్కరికొండ కృష్ణ, చింత మహేశ్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అన్నదాత

- అకాల వర్షాలకు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- రైతులను ముంచుతున్న కొనుగోళ్ల జాప్యం
- తరుగు పేరిట మిల్లర్ల మోసాలు

ఒకవైపు ప్రకృతి.. మరోవైపు సర్కారు నిర్లక్ష్య వైఖరి.. రైతులను నిండా ముంచుతున్నది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కండ్లెదుటే అకాల వర్షానికి తడిసిముద్దవుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు చేరిన వడ్లను సమయానికి తూకం వేయకపోవడం, బస్తాలు తరలించకపోవడంతో మొలకలు వస్తున్నాయి. అధికారులు, సొసైటీల నిర్లక్ష్య వైఖరితోనే కేంద్రాల నుంచి త్వరగా ధాన్యం తరలడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పదేండ్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జరిగిన కొనుగోళ్లు..కాంగ్రెస్ సర్కారు రాగానే జాప్యం జరుగుతున్నదని మండిపడుతున్నారు. మరికొన్ని చోట్ల మిల్లులకు తరలిన వడ్లకు తరుగు పేరిట మిల్లర్లు దోచేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు భగ్గుమంటున్నారు



తరుగు పేరిట రైతులను వేధిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నిజాంసాగర్/ ఎల్లారెడ్డి రూరల్, మే 17: తరుగు పేరిట రైతులను వేధిస్తే రైస్‌మిల్లర్లపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ హెచ్చరించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ సొసైటీ పరిధిలో ఉన్న అచ్చంపేట,ఆరెపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరుగు పేరిట కొందరు రైస్‌మిల్లర్లు రైతులను వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేపట్టి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి కావొస్తున్నదని, బస్తాల తరలింపులో జాప్యం ఏర్పడి రైతులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ధాన్యాన్ని నిజామాబాద్, సిద్దిపేట్ జిల్లాల్లోని రైస్‌మిల్లర్లకు తరలించేందు అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఖాళీ గోడౌన్‌లలో ధాన్యం నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో వర్షాలు ఉన్నందున ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలను సూచించారు. ఆర్డీవో, తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్, తహసీల్దార్ భిక్షపతి ఉన్నారు.

ధాన్యం తరలింపులో ఆలస్యం చేయొద్దు

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వందశాతం ట్యాబ్ ఎంట్రీ చేయాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. వారి వెంట ఎల్లారెడ్డి సొసైటీ సీఈవో విశ్వనాథం, రైతులు ఉన్నారు.

ఫిర్యాదు అనంతరం ట్రక్‌షీట్‌ను చూపిస్తున్న రైతులు

వడ్ల తూకంలో అవకతవకలు

అదనపు కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

కంఠేశ్వర్, మే 17: వడ్ల తూకంలో అవకతవకలు జరుగుతున్నాయంటూ డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామానికి చెందిన రైతులు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశా రు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఖుద్వాన్‌పూర్ సహకార సంఘం పరిధిలోని మారంపల్లి కొనుగోలు కేంద్రంలో వడ్లను తూకం చేసి మిల్లు కు పంపిన తర్వాత తూకం తక్కువగా వచ్చినట్లు ట్రక్‌షీట్ ఇస్తున్నారని, ఇదేంటని సెంటర్ ఇన్‌చార్జి భూమేశ్‌ను అడిగితే మీ ఇష్టం వచ్చిన వాళ్ల దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని నిర్లక్ష్యపు సమాధానమిస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై సహకార సంఘ చైర్మన్ సీఈవోను అడిగితే అన్ని సొసైటీల్లో తూకం తరుగు తీస్తారని, దిక్కున్నచోట చెప్పుకోండని అంటున్నారని తెలిపారు. సెంటర్‌లో 41.700కిలోలు తూకం వేస్తుండగా లారీ లోడ్ దించిన 10 రోజుల తర్వాత ప్రతి లోడ్‌కు 5 ,6 బస్తాలు తరుగువస్తుందని అంటున్నారని, అంత మొత్తం తరుగు ఎలా వస్తుందో అర్థంకావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ట్రక్ షీట్లలో దాదాపు ఒక్కో దాంట్లో 20 బస్తాలు తరుగు తీశారని పేర్కొన్నారు. అసలే అకాల వర్షాలకు పంట నష్టపోయామని, ఇప్పుడు తరుగు పేరిట మోసపోతున్నామని, న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

ట్రక్‌షీట్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ పాటిల్, అధికారులు

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి : వీసీలో సీఎస్ శాంతికుమారి

కామారెడ్డి,మే 17: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, ధరణి ధరఖాస్తులు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ విజయవంతంపై సిబ్బందిని అభినందించారు. పాఠశాలల పునఃప్రారంభానికి మరో 20 రోజులు మాత్రమే గడువు ఉండడంతో మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల యూనిఫాంల కోసం ఇప్పటికే 17 జిల్లాలకు బట్ట చేరిందని అన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో లక్షా 15 వేల దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉన్నప్పటికీ 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. ఐదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీసీలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు, పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డీఎంహెచ్‌వోగా డాక్టర్ చంద్రశేఖర్

కామారెడ్డి, మే 17: కామారెడ్డి డీఎంహెచ్‌వోగా దోమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్‌ను నియమిస్తున్నట్లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్‌కు గతంలో రెండు సార్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా చేసిన అనుభవం ఉండగా, ప్రస్తుతం పూర్తిస్థాయి డీఎంహెచ్‌వోగా నియమించారు. కాగా ఇదివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా ఉన్న లక్ష్మణ్‌సింగ్‌పై లైంగిక వేధింపులతోపాటు ఇతర కేసుల్లో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే.



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్/కోటగిరి, మే 17: పార్టీని నమ్మిన కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇటీవల పలువురు కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబాలకు పార్టీ బీమా చెక్కులను తన స్వగృహంలో పోచారం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ స్వప్రయోజనాలను ఆశించకుండా బీఆర్ఎస్ కోసం పనిచేసే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అందుకు పార్టీ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందనడానికి నిదర్శనమే ఈ ప్రమాద బీమా పథకమన్నారు. బోర్లం గ్రామానికి చెందిన జక్కా లక్ష్మణ్, హంగర్గఫారానికి చెందిన కాంబ్లే దిలీప్ కుమార్, హుమ్నాపూర్ గ్రామానికి చెందిన సట్ట గంగామణి మరణించగా వారి కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల చొప్పున ప్రమాదబీమా చెక్కులను అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బాధితుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.